క్లుప్తంగా

విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



అమ్మవారిని దర్శించుకొంటున్న భక్తులు

గాజువాక: గాజువాక హైస్కూల్ రోడ్ కృష్ణానగర్ కొండపై వేంచేసి ఉన్న విజయ దుర్గాదేవి ఆలయ 11వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో విశేష హోమాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. పంచామృతాభిషేకం అనంతరం నూతన వస్త్రంతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణానగర్, జోగవానిపాలెం, బొజ్జన్నకొండ, పెంటయ్యనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల నుంచి మహిళలు తెల్లవారు జామునే ఆలయానికి చేరుకొని అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గర్భ గుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ సన్నిధిలో వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ధర్మకర్తలు పల్లా కుమార్, పల్లా సురేష్, యలమంచిలి మణిలక్ష్మి తదితరులు వేడుకలను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్వీనగర్ ఫీడర్లలో విద్యుత్ తీగల నిర్వహణ పనులను సోమవారం చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎల్వీనగర్, కుంచుమాంబ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నేడు

అగనంపూడి: అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ఆస్పత్రి ఆవరణలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ, ఏవో రవిరాజు తెలిపారు. కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించనున్న కార్యక్రమంలో నూతనంగా నియమితులైన డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం తర్వాత ఆస్పత్రిలో సమస్యలు, అసంపూర్తి నిర్మాణ పనులపై చర్చించనున్నారు.

విరబూసిన వేప పువ్వు



వేపచెట్టుకు బూసిన పువ్వు, కాయలు

గాజువాక: ఆటోనగర్‌లోని ఒక కంపెనీ ప్రాంగణంలోని వేపచెట్టుకు పువ్వు విరగబూసింది. ఉగాది సమయానికి పూయాల్సిన వేప పువ్వు సీజన్ కాని సీజన్‌లో పూయడంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఆర్‌కేబీ గ్లోబల్ ఫ్లెక్స్ కంపెనీ ప్రాంగణంలోని వేపచెట్టుకు పువ్వు, వేపకాయలు కాశాయని ఆనోటా, ఈనోటా వినడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కూర్మన్నపాలెం డిపో తరలింపు ఆపాలి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఈయూ నాయకులు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపోను తరలించకుండా అడ్డుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం మ్మెల్యే పల్లా శ్రీనివాసరావును నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. డిపో స్టీల్‌ప్లాంట్ స్థలంలో ఉందని.. ప్రస్తుత లీజు కొనసాగించాలంటే డిపాజిట్ రూ.133 కోట్లు చెల్లించాలని యాజమాన్యం డిమాండ్ చేస్తుందని వివరించారు. డిపాజిట్ మినహాయింపు ఇస్తూ 33 ఏళ్ల లీజు గడువు ఇచ్చేలా చూడాలన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి ద్వారా కేంద్ర ఉక్కు మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ డిపో తరలింపు లేకుండా ప్రయత్నం చేస్తామని లేదంటే అగనంపూడి టోల్‌గేటు సమీపంలో ప్రభుత్వం డిపోకు స్థలం కేటాయించేయాలా చూస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్. మూర్తి, కె. శ్రీనివాసరావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్. ప్రకాశ్, బండారు రాము తదితరులు పాల్గొన్నారు.

వేయి పేజీల్లోని సమాచారం అయినా ఒకే చిత్రంతో కళ్లకు కట్టినట్టు చూపే చక్కని కళే చిత్రలేఖనం. చిన్ననాడు కాగితాలపై పిల్లలు ఏదో గీస్తుంటే అప్పటికి తెలియదు ఆ తల్లిదండ్రులకు తమ చిన్నారులు **జాతీయ స్థాయిలో రాణిస్తారని..అలాంటి కోవకే చెందుతారు ఆ అక్కా తమ్ముళ్లు. చిత్రలేఖనంలో రాణిస్తున్నారు ఉక్కునగరం కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి పూర్తి చేసి ఇంటర్‌లో** చేరిన **అదపాక తేజస్విని, ఆ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న వేద భరద్వాజ్‌లు.**

– ఉక్కునగరం


కుంచె.. కదిలించె

చిత్రాలు మాట్లాడుతాయ్

- చిత్రలేఖనంలో అక్కాతమ్ముళ్ల ప్రతిభ
- అవార్డుల పంట



భరద్వాజ్ గీసిన చిత్రం



తేజస్విని గీసిన చిత్రం



చిన్నతనం నుంచి ఆసక్తి

రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అదపాక రవి కుమార్, కనకమహాలక్ష్మి దంపతుల పిల్లలే తేజస్విని, వేదభరద్వాజ్‌లు. చిన్ననాటి నుంచి చిత్రకళపై ఆసక్తి కనబరిచేవారు. తేజస్విని 2వ తరగతి, వేద భరద్వాజ్ 1వ తరగతి నుంచి చిన్న చిన్న చిత్రాలు గీసేవారు. తేజస్విని 3వ తరగతిలో, వేద భరద్వాజ్ 2వ తరగతిలో ఉక్కునగరం కేంద్రీయ విద్యాలయంలో చేరారు. అక్కడ పలు సంస్థలు, పాఠశాలలు నిర్వహించే చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనేవారు. వీరిఆసక్తిని గమనించి పరవాడకు చెందిన చిత్రలే ఖనం ఉపాధ్యాయుడు డి. దానయ్య వద్ద శిక్షణకు చేర్పించారు.

ఆలోచింపజేసే చిత్రాలు



ఉషోదయ వేళ భానుడి ప్రకాశం, పల్లె సీమలో పక్షుల కిలకిల రావాలు, వ్యవసాయానికి వెళుతున్న అన్నదాతలు, సెలయేరు పరవళ్లు, పిల్లకాలువల జలకళలు ఇలా చక్కని పల్లె చిత్రాలు కళ్లకు కట్టినట్టున్న గీశారు. విద్యుత్ ఆదా అయ్యే మార్గాలు, ఉత్పత్తిని పెంచే మార్గాలు చూపే చిత్రాలకు జీవం పోశారు. జాతీయ నాయకులు మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తదితరుల చిత్రాలు గీసి తమ ప్రావీణ్యతను చాటుకున్నారు.

అక్క అడుగు జాడల్లో తమ్ముడు...

చిన్నప్పటి నుంచి అక్కతో పాటు వేద భరద్వాజ్ చిన్న చిన్న చిత్రాలు గీసేవాడు. తర్వాత ఉక్కునగరంలో తీసుకున్న శిక్షణతో మంచి చిత్రకారుడిగా ఎదిగాడు. ఆ తర్వాత చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు గెలుపొందాడు.

తేజస్విని అందుకున్న పురస్కారాలు



- విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ, అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో 2023లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో బాల చిత్ర కళా అవార్డుతో పాటు బంగారు పతకం కైవసం చేసుకుంది.
- విజయవాడకు చెందిన ఫైన్ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2022 మార్చిలో నిర్వహించిన 9వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని గెలుపొందింది.
- 7వ తరగతిలో ఉండగా 2021లో గాజువాకలోని యాపిల్ ఐ పాఠశాల నిర్వహించిన ఇంటర్ స్కూల్ డ్రాయింగ్ పోటీల్లో ప్రత్యేక బహుమతి సాధించింది.

వేద భరద్వాజ్‌కు లభించిన అవార్డులు



- ఈ ఏడాది ఏప్రిల్‌లో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్స్, విజయవాడ డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 12వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో భరద్వాజ్ బంగారు పతకం, జాతీయ స్థాయి బాల చిత్ర కళా పురస్కారం కైవసం చేసుకున్నాడు
- విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ- అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో 2023లో నిర్వహించిన 10వ జాతీయ చిత్రలేఖనం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం గెలుపొందాడు.
- పిడిలైట్ సంస్థ ఆధ్వర్యంలో 2021లో నిర్వహించిన ఫెవిక్రియేట్ హాల్ ఆఫ్ ఫేం పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాడు.

ఆనందంగా ఉంది



నేను చిత్రలేఖనంలో వందలాది మంది బాలబాలికలకు శిక్షణ ఇచ్చాను. అయితే తేజస్విని, భరద్వాజ్‌లు చిత్రలేఖనంపై ఉన్న ఆసక్తి వల్ల తక్కువ కాలంలోనే మంచి చిత్రాలు గీయడం మొదలు పెట్టారు. వారు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనేక అవార్డులు, పురస్కారాలు అందుకోవడం డ్రాయింగ్ టీచర్‌గా నాకు గర్వకారణంగా ఉంది.

– డి.దానయ్య, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



నక్క వెంకటరమణను సత్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: పార్టీ పదవులు పొందిన వారంతా నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నక్క వెంకటరమణ ఆదివారం దేవన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. దేవన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. దేవన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందన్నారు. నక్కరమణకు అభినందనలు తెలియజేసి సత్కరించారు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా చినతల్లి,కొయ్య భారతి, మార్టుపూడి పరదేశి,వార్డు అధ్యక్షులు ధర్మాల శ్రీను, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి, పిట్టారెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్లో సైక్లింగ్ పోటీలు



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ గంగారావు, సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం స్లో సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా టౌన్‌షిప్‌లో నిర్వహించిన 5 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో సేవ్ వైజాగ్ స్టీల్ అంటూ నినాదాలు చేశారు. ర్యాలీని ప్రారంభించిన 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా అభిప్రాయం వెల్లడించినా విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రతిఘటించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సీటూ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కర్మాగారంలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తూ ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసరాజు, పుల్లారావు, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ర్యాలీ



ఏడీఈ కార్యాలయం వద్ద ప్రసంగిస్తున్న అసోసియేషన్ నాయకుడు వెంకటేశ్వరరావు

గాజువాక: అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిరి ఎన్‌క్లేవ్, గ్రీన్ లైఫ్ అపార్ట్‌మెంట్, స్వర్ణసాయి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వాసులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తోకాడలోని సమైక్య అపార్ట్‌మెంట్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఆటోనగర్‌లోని ఏడీఈ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు రామన్న, ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏడాదిలోపే సర్దుబాటు రూపంలో చార్జీల భారం మోపిందన్నారు. స్మార్ట్ మీటర్ల రూపంలో మరోసారి భారీ భారాన్ని మోపడానికి పూనుకుందన్నారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తే సెల్ ఫోన్ మాదిరిగా విద్యుత్‌కు కూడా రీచార్జి చేసుకోవాలన్నారు. పీక్ అవర్ లోడ్స్ పేరిట భారీగా భారం మోపుతారని అన్నారు. తక్షణమే వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బి.తాడన్న, శివకుమార్, నాగేశ్వరరావు, రఘుపతి, శ్రీనివాసరావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం గాలికి..

- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి
- 86వ వార్డులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ



86వ వార్డులో పర్యటిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం మానేశారని ఆయన పేర్కొన్నారు. జీవీఎంసీ 86వ వార్డులో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో దేవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కక్ష సాధింపు రాజకీయాలకే పాలనను పరిమితం చేసిందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కల్లబొల్లి కబుర్లతో చంద్రబాబు ముందుకు సాగుతున్నారన్నారు. ప్రభుత్వ విధ్వంస పాలనను ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తద్వారా వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని దేవన్‌రెడ్డి కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. వార్డు ఇన్‌చార్జి చేగొండి శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు భూపతిరాజుశ్రీనివాసరాజు, మెడికల్‌బాబు, చిట్టిదేముడు, శ్రీనివాస్ పట్నాయక్, సుబ్బరాజు, గుండన్‌రాజు, రామచంద్రరాజు, మహిళానాయకులు సరోజని, నిర్మల,భారతి, భాను, పద్మ తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న, దేవన్‌రెడ్డి, నాయకులు

బాల వికాస్ ఆధ్వర్యంలో జాతీయ పతాకోత్సవాలు



జాతీయ పతాకాలతో బాలలు

అగనంపూడి: భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలు, పంద్రాగస్టును పురస్కరించుకొని సత్యసాయి బాల వికాస్ ఆధ్వర్యంలోఆదివారం జాతీయ పతాకోత్సవాలు నిర్వహించారు. 85వ వార్డు కొండయ్యవలసలోని బాల వికాస్ కేంద్రంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బాలలకు జాతీయ నాయకుల వేషధారణ, భజన, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. బాల వికాస్ కేంద్రం ప్రాముఖ్యతను సత్యసాయి భజన మండలి ప్రతినిధులు విందుల రామారావు, వరహాలు వివరించారు. విద్యార్థి దశలోనే దేశభక్తి, స్వామి భక్తి, దైవ చింతన, సేవా గుణం అలవర్చడం, అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, బాల వికాస్ గురువులు విందుల పద్మలత, రఘునాథరావు, గోవిందరావు, బి.వి.సుబ్బారావు, విదుల పైడినాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ప్రసంగిస్తున్న సీ అధ్యక్షుడు చంద్రరావు

ఉక్కునగరం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీ అధ్యక్షుడు చంద్రరావు అన్నారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో ఆదివారం సీ భవన్‌లో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌కు మంచి స్పందన లభించింది. లియో ఫార్మా లిమిటెడ్, ఉక్కు అధికారుల సంఘం (సీ) సహకారంతో 'ప్రాజెక్ట్ స్మూత్ వాక్' శిబిరంలో రోగులకు ఎత్తు, బరువు, బీపీ, హెచ్‌బీ, ఆర్‌బీఎస్, నడుం మరియు మోకాలి సారూప్యత, చేయి పటుత్వ పరీక్షలు చేశారు. ఆహారనిపుణులు సలహాలు అందజేశారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ సారంగి, ప్లాంట్ పర్సనల్ ఇన్‌చార్జి ఎన్. భాను, సీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్‌లు మాట్లాడుతూ రెండో రోజు కూడా కొనసాగనున్న వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీఐ, సీ, లియో ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

టెన్షన్..టెన్షన్

- వడ్లపూడి కూడలిలో పని చేయని సిగ్నల్స్
- ఇష్టానుసారంగా వాహనాల రాకపోకలు



సిగ్నల్స్ లేకపోవడంతోఅన్ని వైపుల నుంచి ఒకేసారి వెళ్తున్న వాహనాలు



జాతీయ రహదారికి ఆనుకొని రాళ్లు తేలిన వడ్లపూడికి వెళ్లే రోడ్డు

కూర్మన్నపాలెం: సిగ్నల్స్ మరమ్మతులకు గురై ఏడాది కావస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు, ప్రయాణికులు హడలిపోతున్నారు. వడ్లపూడి ముఖ్యకూడలి వద్ద చాలా కాలం నుంచి సిగ్నల్స్ పనిచేయడం లేదు. అనునిత్యం రద్దీగా ఉండే ఆ కూడలి వద్ద ఎవరు ఎటువైపు వెళ్తారో తెలియని పరిస్థితి ఏర్పడి ప్రయాణికులు తికమకపడుతున్నారు. దీనికి తోడు పైపులైను పేరుతో వడ్లపూడి ఊరిలోకి వెళ్లే ప్రధానరహదారిని కూడా జాతీయరహదారి పక్కన తవ్వేశారు. తర్వాత దాన్ని సరిగ్గా పూడ్చకపోవడంతో పిక్క,రాళ్లు తేలిపోయి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులతో పాటు వేలాది భారీ వాహనాలు ఆ రహదారి గుండా ప్రయాణం చేస్తుంటాయి. అక్కడ ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. కళ్లు మూసి తెరచేలోగా వందలాది వాహనాలు దూసుకుపోతునే ఉంటాయి. అలాంటప్పుడు ఎవరైనా ఏమరుపాటుగా ఉంటే ఊహించుకోడానికే భయం వేస్తుంది. అటువంటి కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయినా అధికారులు చూడలేదో.. పట్టించుకోలేదో తెలియదు కాని సిగ్నల్స్ మాత్రం పనిచేయడం లేదు. అంత బిజీగా ఉన్న రహదారిపై సిగ్నల్స్ పనిచేయకపోయినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు నిర్వహించి సిగ్నల్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.

స్వచ్ఛ రైల్వేస్టేషన్‌లో మేము సైతం



రైల్వేస్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్త తొలగిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



మొక్క నాటుతున్న సంస్థల ప్రతినిధులు

అగనంపూడి: స్వచ్ఛ రైల్వేస్టేషన్ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. తొమ్మిది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆదివారం దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో ప్లాట్‌ఫారం వైపు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పంద్రాగస్టు నాటికి రైల్వేస్టేషన్ ఆవరణను పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు, చెత్తా చెదారం లేకుండా చేయాలని భావించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్వచ్ఛ రైల్వేస్టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాయి. పరిపాలనా భవనం ముందు ఉన్న వీఐపీ లాంజ్, వాహనాల పార్కింగ్ ప్రదేశం, సిగ్నల్ క్యాబిన్ భవన సముదాయం, టికెట్ కౌంటర్ వెనుక భాగాన్ని శుభ్రం చేశారు. స్పందన చేయూత సంస్థ ఆధ్వర్యంలో ఆవరణలో మొక్కలు నాటారు. విశాఖ ఉక్కులో కంపెనీ సెక్రటరీగా పనిచేసి పదవీ విరమణ పొందిన నారాయణరావు ఎనిమిది పదుల వయసులో చీపురుపట్టి చెత్తను ఊడ్చి ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, మానవ వికాస వేదిక, మావవతా, సత్యసాయి సేవా సమితి, యూత్ హాస్టల్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే అధికారులు, సిబ్బంది, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



మహేష్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన లైఫ్ గార్డ్స్

పెదగంట్యాడ: యారాడ తీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన యువకుడు సముద్రంలో దిగి కెరటాల ఉధృతికి కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న బీచ్ లైఫ్ గార్డ్స్ రక్షించారు. వివరాలివి. గంగవరానికి చెందిన యవకులు ఆదివారం యారాడ తీరానికి వెళ్లారు. కాసేపు ఇసుక తిన్నెల్లో గడిపిన యువకులు స్నానానికి సముద్రంలో దిగారు. ఒక్కసారిగా అలల తాకిడి పెరగడంతో గరికిన మహేష్(30) సముద్రంలోకి కొట్టుపోతుండగా, అక్కడే ఉన్న లైఫ్ గార్డ్స్ కదిరి లోవేష్‌కుమార్, కదిరి వెంకటేష్, శ్రీనివాస్, కె.వెంకటేష్ గమనించారు. వెంటనే వారు సముద్రంలోకి దిగి, కొట్టుకుపోతున్న మహేష్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో యువకుడికి ప్రాణపాయం తప్పింది.